క్లుప్తంగా

క్రమశిక్షణతో చదువుకోవాలి



మాట్లాడుతున్న కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి

తాడిపత్రి రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి సూచించారు. మండలంలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం బీటెక్ విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. డైరెక్టర్ నటరాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వ్యసనాలకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆలయాభివృద్ధిపై దృష్టి సారించండి'

గుంతకల్లు రూరల్: ఆలయ అభివృద్ధి, భక్తులకు సౌకర్యాల కల్పనపై దృష్టిని సారించాలని ఈఓ విజయరాజుకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సూచించారు. శనివారం స్వామివారి దర్శనార్థం కసాపురం వచ్చిన ఎమ్మెల్యే అనంతరం ఈఓతోపాటు దేవదాయ శాఖ డీవో శ్రీనివాసరావుతో కలిసి మాస్టర్ ప్లాన్ నిర్మాణం, ఆలయ అభివృద్ధి తదితర వాటిని సమీక్షించారు. మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా ఆలయ అభివృద్ధే ధ్యేయంగా మాస్టర్ ప్లాన్ నిర్మాణాన్ని కొనసాగించాలని సూచించారు.

సురవరం ఆశయాలను కొనసాగిద్దాం



గుంతకల్లులో సురవరం చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లు: సురవరం సుధాకర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ నాయకులు అన్నారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సురవరం సుధాకర్‌రెడ్డికి శ్రద్ధాంజలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కమ్యూనిస్ట్ పార్టీకి 'సురవరం' చేసిన సేవలను కొనయాడారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు దేవేంద్ర, ప్రజా నాట్య మండలి నాయకుడు కుళ్లాయప్ప, ఏఐటీయూసీ నాయకుడు తలారి సురేష్, నాయకులు ఓబులేసు, నూర్‌మహమ్మద్, రమేష్ పాల్గొన్నారు.

యాడికి: మండల కేంద్రంలో నారాయణ స్వామి కాలనీలో సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి చిత్ర పటానికి ఆ పార్టీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ కోసం ఆయన సేవలను కొనియాడారు.

పెన్షనర్ల సంఘానికి విరాళం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని పెన్షనర్ల సంఘానికి శనివారం రిటైర్డ్ ఎంఈఓ గండ్లూరు లక్ష్మీరెడ్డి రూ.10 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి, సభ్యులు హనుమంతరెడ్డి, వీరారెడ్డి, ఆదినారాయణ స్వామి, సూర్యనారాయణరెడ్డి, అశ్వత్థరెడ్డి, కుల్లాయిరెడ్డి, శివసుబ్రమణ్యం, వెంకటరామయ్య, రంగయ్య, బాలయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పెద్దపప్పూరు: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌లో శనివారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శ్రీకృష్ణుడి చిత్రపటం ఊరేగింపు



కృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

గుంతకల్లు రూరల్: త్రైత సిద్ధాంత ప్రభోద సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక నరసాపురం, గుత్తి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని నరసాపురంలో శ్రీకృష్ణుడి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణాష్టమి సందర్భంగా గ్రామంలో స్వామివారిని కొలువుదీర్చి 8 రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించిన గ్రామస్తులు సాయంత్రం స్వామిని పల్లకీపై కొలువుదీర్చి ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తాడిపత్రి రోడ్డులో చెత్త కుప్పగా ఉన్న దృశ్యం

పేరుకున్న అపరిశుభ్రత

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మున్సిపల్ శానిటేషన్ వర్కర్లు మూడు రోజులకు ఒకసారి కూడా చెత్తను శుభ్రం చేయడం లేదు. చెత్త కుప్పలుగా పేరుకుపోవడంతో దోమలు, పందులు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో రోగాల బారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుపరచాలని ప్రజలు కోరారు.



బెంచ్ కొట్టాలలోని మీ సేవ ఎదురుగా సందులో ఇళ్ల ముందు నిలిచిన మురుగు

అస్తవ్యస్తంగా డ్రైనేజ్

గుంతకల్లు: స్థానిక బెంచి కొట్టాలలోని డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. కాలవలోని మురుగు ముందుకు కదలక, ఇళ్ల ముంగిట నిలుస్తున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. బెంచ్ కోట్టాలోని మీ సేవ ఎదురుగా సందులో డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో చెత్తచెదారం పేరుకుపోయి మురుగు రోడ్డుపై నిలుస్తోంది. దీంతో దుర్వాసనతోపాటు దోమలు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు స్పందించి కాలవలను శుభ్రం చేయించాలని కోరారు.



పోర్టర్స్ లైన్‌కు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

పొంచి ఉన్న ప్రమాదం

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఆర్‌అండ్‌బీ సర్కిల్ నుంచి పోర్టర్స్‌లైన్ వెళ్లే రోడ్డు మధ్యలో అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. అసలే వర్షాకాలం గాలీవాన బీభత్సానికి స్తంభాలు నేలకొరిగినా, ఆదమరిచి వాహనదారులు స్తంభాలను ఢీకొట్టినా, పాదచారులు ముట్టుకున్నా ప్రమాదం జరిగే అవకాశముంది. అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులకు పింఛన్లు పునరుద్ధరించాలి

పుట్లూరు: రీ వెరిఫికేషన్ పేరుతో తొలగించిన పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి సూరి శనివారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ కడవకల్లులో పర్యటిస్తున్నారనే సమాచారంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తమ సమస్యలను ఆయనకు తెలపడానికి వచ్చారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అనంతరం ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఇందులో తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని, ఇళ్లు, ఇంటి స్థలాలు పంపిణీ చేపట్టాలని పేదలు వినతి పత్రాలు అందించారు.

పింఛన్లు పునరుద్ధరించాలి

గుత్తి రూరల్: తొలగించిన పింఛన్లు వెంటనే పునరుద్ధరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్లు తొలగించిన లబ్ధిదారులు శనివారం ఆందోళన చేశారు. మండలంలోని తొండపాడు, అనగాదొడ్డి, ధర్మాపురం, పెద్దొడ్డి, కొత్తపేట తదితర గ్రామాలకు చెందిన పింఛన్‌దారులు కార్యాలయానికి వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. తొలగించిన పింఛన్లను పునరుద్ధరించని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి తమకు తొలగించిన పింఛన్ల జాబితా వచ్చిందని, వాటిని అమలు పరిచామని అధికారులు వారికి వివరించారు.

'కూటమి'కి దివ్యాంగుల ఉసురు తప్పదు

బుక్కరాయసముద్రం: పింఛన్లు తొలగించడంతో కూటమి ప్రభుత్వానికి దివ్యాంగుల కన్నీటి ఉసురు తప్పదని దళిత సంఘాల నాయకులు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన నిర్వహించారు. దళిత సంఘం నేతలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ఐదు లక్షల మంది పింఛన్లు తొలగించిందన్నారు. దివ్యాంగుల పింఛన్ల తొలగింపుపై కూటమి ఎమ్మెల్యేలు నోరు మెదపకుండా ఉండడం సిగ్గు చేటన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ సాల్మన్‌కు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరికూటి కాటమయ్య, వెంకటేష్, రామాంజనేయులు, నాగేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.



పుట్లూరులో కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న సీపీఎం నాయకులు, ప్రజలు

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థల పరిశీలన

తాడిపత్రి రూరల్: మండలంలోని పెద్దపోల మడ సమీపంలో రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న పెట్రోల్ బంకు కోసం శనివారం కలెక్టర్ వినోద్ కుమార్ స్థల పరిశీలన చేశారు. తాడిపత్రి-అనంతపురం జాతీయ రహదారి పక్కన సర్వే నెంబర్ 1390లో పెట్రోల్ బంకును ఏర్పాటు చేయనున్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు ఉన్నారు.

సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు



మాట్లాడుతున్న ఉమామహేశ్వరమ్మ

బుక్కరాయసముద్రం: శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ, రేకులకుంట వ్యసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు సూఇచంచారు. శనివారం మండలంలోని రేకులకుంటలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు 60 శాతం విత్తనం వేశారన్నారు. ప్రస్తుతం జిల్లాలో కురుస్తున్న వర్షాలకు చీడ పీడలు తెగుళ్ల సమస్య ఎక్కువయ్యే సమస్య ఉందన్నారు. అలాగే ఎరువుల కొరత ఏర్పడుతోందన్నారు. ప్రత్యామ్నాంగా సేంద్రియ ఎరువులు వినియోగించు కోవాలన్నారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ పద్మలత, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి, రెడ్డిపల్లి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, వాతావరణ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ జాహ్నవి పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా చేసుకోవాలి



గుత్తిలో మాట్లాడుతున ఎస్‌ఐ సురేష్

గుత్తి: వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సురేష్ సూచించారు. గుత్తిలోని విరూపాక్షి రెడ్డి కల్యాణ మంటపంలో శనివారం గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధి తెగదొడ్డి తిమ్మారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడారు. వినాయక విగ్రహాలు ఏర్పాటు చేయదలచిన వారు తప్పనిసరిగా పోలీసులు, రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులతో అనుమతి తీసుకోవాలన్నారు. డీజేలు ఏర్పాటు చేయడానికి వీలు లేదన్నారు. అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకు పండుగను నిర్వహించుకోవాలన్నారు.

విగ్రహాలు ఏర్పాటుకు అనుమతి తప్పని సరి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటుకు పోలీసులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. శనివారం ఎస్‌ఐ మాట్లాడుతూ ఈనెల 27న వినాయక చవితి పండుగ సందర్భంగా ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే కమిటీ సభ్యులు గ్రామంలో రోడ్డుకు అడ్డంగా, ప్రజలకు ఇబ్బంది కలిగే ప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయకూడదన్నారు. అలాగే నిమజ్జనం సమయంలో గొడవలు జరగకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు.

యల్లనూరు: మండలవ్యాప్తంగా ఈనెల 27న వినాయక చవితి పండుగలో భాగంగా వినాయక విగ్రహాల వద్ద ఎలాంటి ఘర్షణ వాతావరణం తలెత్తకూడదని ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి సూచించారు. శనివారం ఎస్‌ఐ పలు గ్రామాల్లో పర్యటించారు. ఆయన మాట్లాడుతూ పల్లెల్లో సమస్యలు సృష్టిస్తే కఠిన చర్యలతో పాటు జైలుకు పంపుతానని హెచ్చరించారు. అనుమతి లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

వైభవంగా 'శ్రావణ' పూజలు



తాడిపత్రి రూరల్: అలంకరణలో ఆలూరు కోన భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి



తాడిపత్రి రూరల్: ఏడు శనివారాల వ్రతం ఆచరిస్తున్న మహిళలు



శింగనమల: దుర్గాంజనేయ స్వామి

తాడిపత్రి రూరల్: తాడిపత్రి పట్టణ, మండలంలో శ్రావణమాసం చివరి శనివారం పురస్కరించుకుని వైష్ణవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని లక్ష్మీ చింతల వెంకటరమణస్వామి, కోదండరామస్వామి, మంత్రాలయ రాఘవేంద్ర స్వామి, మండలంలోని ఆలూరు కోన భూదేవి, శ్రీదేవి సమేత రంగనాథస్వామి, ఓబులేసుకోట, జంబులపాడులోని లక్ష్మీ నరసింహస్వామి తదితర దేవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు చేశారు. అలాగే పట్టణంలోని లక్ష్మీచింతల వెంకటరమణ స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడు మురళి స్వామి ఆధ్వర్యంలో మహిళలు ఏడు శనివారాల వ్రత ముగింపు కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పట్టణ సమీపంలోని పెన్నానదిలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి అర్చకులు తేనే అభిషేకం నిర్వహించారు.

దుర్గాంజనేయ స్వామికి తేనె అభిషేకం

శింగనమల: శింగనమల చెరువు కట్ట వద్ద నున్న దుర్గాంజనేయ స్వామికి శనివారం తేనె అభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అదేవిధంగా దుర్గాదేవికి అభిషేకం, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు రమణ, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కడుపునొప్పితో గర్భిణి మృతి



హరిత (ఫైల్)

యాడికి: కడుపునొప్పితో గర్భిణీ మృతి చెందిన సంఘటన మండలంలోని వీరన్నపల్లిలో శనివారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. మండలంలోని వీరన్నపల్లికి చెందిన కేశవ యాదవ్ కర్నూలుకు చెందిన హరిత(25)ను మూడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి ఏడాది వయస్సున్న కూతురు ఉంది. ప్రస్తుతం మూడు నెలల గర్భిణి అయిన ఆమె శుక్రవారం భర్తతో కలిసి పొలంలో పనులకు వెళ్లింది. రాత్రి 7గంటల సమయంలో ఆమెకు కడుపు నొప్పి రావడంతో కేశవ యాదవ్ ఓ వాహనంలో యాడికి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున హరిత మృతి చెందింది. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వీరన్నపల్లికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని లచ్చానుపల్లి శివారులో శనివారం ద్విచక్రవాహనం బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన శేఖర్, ఆదిలక్ష్మి, దేవి పని నిమిత్తం లచ్చానుపల్లికి వెళ్లారు. పని ముగించుకొని ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా గ్రామ శివారులోని మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో గాయపడిన ముగ్గురినీ గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరికి గాయాలు..

గుత్తి రూరల్: పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి శనివారం కట్టెలు కొడుతుండగా కాలుకు కొడవలి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని వెంటనే కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం అనంతపురం తరలించారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి



కల్లూరులో సీసీ కెమెరాలు అందజేస్తున్న గ్రామస్తులు

గార్లదిన్నె: గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలు అరికట్టవచ్చని ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా సూచించారు. శనివారం ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలోని కల్లూరులో గ్రామస్తులు, దాతల సహకారంతో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో గ్రామస్తులు, దాతలు ముందుకు వచ్చి గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే భద్రత ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు.

ఘనంగా టంగుటూరి జయంతి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో శనివారం ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలను అసోసియేషన్ నాయకులు, సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ సర్దాంభ, అదనపు కార్యదర్శి కుళ్లాయి బాబు తదితరులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

పెద్దపప్పూరు: మండలంలోని జూటూరు సమీపంలో ఉన్న పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పోలీసులు సీజ్ చేశారు. జూటూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ యజమాని నాగేశ్వర్‌రెడ్డితో పాటు డ్రైవర్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

పందుల అపహరణ

పెద్దపప్పూరు: మండలంలోని రామకోటి కాలనీ వద్ద ఎరుకల మహేష్‌కు చెందిన 16 పందులను శనివారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గతంలో ఇలాగే మూడుసార్లు జరిగిందని బాధితుడు వాపోయాడు. న్యాయం చేయాలని ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్‌కు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు



గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

గుత్తి/తాడిపత్రి రూరల్/గార్లదిన్నె/యాడికి/పామిడి: చెత్తను రోడ్లపై పడేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియా హెచ్చరించారు. గుత్తిలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కమిషనర్ సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులతో కలిసి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. చెత్తను రోడ్లపై పడేస్తే చర్యలు తీసుకుంటామని దుకాణదారులు, హోటళ్ల యజమానులను హెచ్చరించారు. మొదటి సారి జరిమానాతో సరిపెడతామని, రెండో సారి రిపీట్ అయితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోలో నిర్వహించిన ర్యాలీలో మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. గార్లదిన్నెలో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ యోగానందరెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. యాడికిలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీఓ వీర్రాజు ఆధ్వర్యంలో హెచ్ఎం సీతారామాంజనేయులు, ఉపాధ్యాయులు, ఈఓపీఆర్డీ శశికళ, ఏపీఓ మద్దిలేటి, వైద్యులు పరమేశ్వర, తాడిపత్రి మలేరియా పబ్ యూనిట్ అధికారి శ్రీనివాసుల, సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, రెవిన్యూ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. పామిడిలో నిర్వహించిన ర్యాలీలో ఈఓ కమ్ ఈఓఆర్డీ అశ్వర్థ నాయుడు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ డీఏ, ఐఆర్ విడుదల చేయాలి



ఎంఈఓలకు సమస్యలు వివరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గార్లదిన్నె: ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్ వెంటనే విడుదల చేయాలని ఏపీటీ ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు.శనివారం ఏపీటీఎఫ్ మండల కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన పరీక్ష విధానం అస్తవ్యస్తంగా ఉందన్నారు. పాత పరీక్ష విధానం కొనసాగించాలన్నారు.అలాగే పెండింగ్‌లో ఉన్న డీఏ, ఐఆర్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓలు చంద్రనాయక్, వెంకటరమణ నాయక్‌కు పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు ప్రసాద్, గౌరవ సలహాదారుడు నాగరాజు,అధ్యక్షుడు పర్వతయ్య, ప్రధాన కార్యదర్శి మహేష్, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి, జిల్లా కౌన్సిలర్ రంగనాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి పరిసరాలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..

యల్లనూరు: ఎట్టకేలకు ప్రభుత్వాస్పత్రి పరిసరాలు శుభ్రం చేశారు. మంగళవారం సాక్షి దిన పత్రికలో ' చెరువు కాదు....ఆస్పత్రే' అన్న ప్రచురితమైన కథనానికి వైద్యుడు లోకేష్‌కుమార్‌పై డీఎంఅండ్‌హెచ్‌ఓ భ్రమరాంబికాదేవి సీరియస్ అయ్యారు. దీంతో శనివారం ఆస్పత్రి పరిసరాలను సిబ్బంది శుభ్రం చేశారు. కాగా ఆస్పత్రిలో వైద్యులు లోకేష్‌కుమార్, శివసాయి, సీహెచ్ఓ మధుకుమార్, సూపర్‌వైజర్లు హాజీవలి, నూర్‌బీకు, ఎంయల్‌హెచ్‌పీలు, మిగిలిన ఆరోగ్య సిబ్బంది నడుమ సమన్వయలోపం ఉన్నట్లు తెలుస్తోంది.

కష్టపడ్డారు.. టీచర్ పోస్టులు సాధించారు..



వసుంధర



చిన్న ఓబన్న



రవికుమార్

యాడికి: శుక్రవారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. యాడికిలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్ వసుంధర ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఎంపికైంది. పెద్దపప్పూరు మండలం జూటూరు గ్రామానికి చెందిన నాగరాజు యాదవ్, దేవి దంపతులకు ఇద్దరు కుమా రులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆటో తోలుతూ నాగరాజు కుమారులతో పాటు కుమార్తెను బాగా చదివించారు. వసుంధర 2018లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించింది. 2020లో కరోనా వ్యాధితో తండ్రి మృతి చెందాడు. తండ్రి ఆశయం మేరకు యాడికి పోలీస్టేషన్‌లో ఉద్యోగం చేస్తూనే ఉపాధ్యాయ పోస్టు సాధించాలని కష్టపడి చదివింది. ఉపాధ్యాయ పోస్టు సాధించిన ఆమెను శనివారం కుటుంబ సభ్యులతో పాటు యాడికి సీఐ ఈరన్న, ఎస్‌ఐ రమణయ్య, పోలీసులు అభినందించారు.

- యాడికి మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన చిన్న గంగన్న, నాగలక్షుమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. ముగ్గురు కూతుళ్లు. పిల్లలను చదివించాలనే ఉద్దేశ్యంతో తాడిపత్రికి చేరిన గంగన్న పండ్ల వ్యాపారం చేస్తూ ఉండేవాడు. 2010లో అనారోగ్యంతో గంగన్న మృతి చెందాడు. దీంతో నాగలక్షుమ్మ పిల్లలను చదివించాలని రోడ్లపై కాంక్రీటు పనులు చేసింది. తండ్రి ఆశయాలను నెరవేర్చాలనే ఉద్దేశ్యంతో ల చిన్న ఓబన్న కష్టపడి చదివి బైలాజికల్ సైన్స్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. తండ్రి ఆశయాలను నెరవేర్చిన అతడిని కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

పామిడి: మండలంలోని గజరాంపల్లి గ్రామవాసి, ధర్మవరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు జంగం రవికుమార్ టీచర్ ఉద్యోగం పొందాడు. శనివారం విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు ఎంపికయ్యారు. అతడి ఎంపికపై గజరాంపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.